క్లుప్తంగా

విద్యా దాత పిచ్చుగ కోటయ్య



కోటయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కడియం: మారుమూల గ్రామాల విద్యార్థులకు చదువు అందించాలన్న తలంపుతో తన భూములను స్వచ్ఛందంగా అందజేసి, కళాశాల స్థాపించేందుకు కృషి చేసిన విద్యా దాత పిచ్చుగ కోటయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. కోటయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మారెళ్ల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈదర పాపారావు, వైబీవీ ప్రసాదరావు, మొగలపు రామకృష్ణ, వీరబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్‌కు స్వాగతం పలుకుతున్న నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ

కడియం: కడియపులంకలోని సత్యదేవ నర్సరీని ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏహో బషీర్ గురువారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నర్సరీలోని వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతున్న కడియం ప్రాంత నర్సరీ రైతుల సేవలు అద్భుతమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ బాటిల్‌తో దాడి

కంబాలచెరువు: స్థానిక మినీ సూర్య థియేటర్ వద్ద ఒక వ్యక్తి మరొకరిపై కూల్‌డ్రింక్ బాటిల్‌తో దాడి చేసిన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పొట్టిలంకకు చెందిన భీమరెడ్డి సత్యనారాయణ మినీ సూర్యథియేటర్‌లో సినిమాకు వెళ్లాడు. ఆ సమయంలో తోపులాట జరిగింది. అయితే సినిమా చూసేందుకు వచ్చిన ఒక మహిళపై సత్యనారాయణ అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ సదరు మహిళ భర్త గొడవపడ్డాడు. సినిమా ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చి కూల్‌డ్రింక్ సీసాతో సత్యనారాయణ తలపై కొట్టాడు. దీంతో అతడికి తీవ్రగాయమైంది. అకారణంగా తనపై కూల్‌డ్రింక్ సీసాతో దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న ఏడీసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: అన్న క్యాంటీన్లలో నిర్వహణ పరంగా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ హెచ్చరించారు. ఆయన గురువారం శేషయ్య మెట్టలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారమే భోజన పదార్థాలు ఉండాలని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు.

గోదావరిలో రెండు మృతదేహాలు లభ్యం



గోదావరిలో లభ్యమైన మృతదేహాలు

కంబాలచెరువు: గోదావరిలో మార్కండేయేశ్వరస్వామి ఘాట్ వద్ద గురువారం గుర్తుతెలియని పురుషుడు, మహిళ మృతదేహాలు లభించాయి. నదిలో తేలియాడుతున్న వీటిని స్థానికులు చూసి, స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మృతదేహాలను వెలికితీశారు. ఆచూకీ కోసం గాలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. వారి వయసు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్, ఫోన్ నెంబర్ 94407 96574కు తెలపాలన్నారు.

కచ్చితంగా.. పకడ్బందీగా..

- షెడ్యూల్ ప్రకారం పాఠశాల అసెంబ్లీ
- సమయపాలన పాటించాల్సిందే
- తనిఖీ చేస్తున్న అధికారులు



నగరంలోని ఓ పాఠశాలలో అసెంబ్లీకి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంబాలచెరువు: విద్యార్థులకు క్రమశిక్షణ అనేది పాఠశాల నుంచే అలవడాలి. లేకపోతే పెద్దవారైన తర్వాత తన చుట్టూ ఉన్న వారిని అసౌకర్యానికి గురి చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. అటువంటి విధానానికి స్వస్తి పలికేందుకు పాఠశాలలో తరగతి ప్రారంభానికి ముందే అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం అన్ని పాఠశాలల్లో అసెంబ్లీ ఉదయం 9.05 గంటలకు ప్రారంభమై 9.15 ముగుస్తుంది. ముందుగా అసెంబ్లీ బెల్ 9 గంటలకు కచ్చితంగా మోగించాలి. అయితే కొందరు ఈ సమయపాలన లేకుండా అసెంబ్లీని నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ గంట కొట్టి మొక్కుబడిగా పని కానిచ్చేస్తున్నారు. ఒక్కోసారి 9 గంటల తర్వాత అసెంబ్లీ ప్రారంభమవుతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటికి చెక్ పెట్టేలా నగర విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు అమలు చేయాల్సిన అసెంబ్లీ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చే సోమవారం నుంచి వీటి అమలు తీరుపై కచ్చిత చర్యలు చేపట్టనున్నారు.

విద్యాశాఖాధికారుల తనిఖీలు

పాఠశాలల్లో సమయానికి అసెంబ్లీని కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని స్కూళ్లను విద్యాశాఖాధికారులు ఇప్పటికే తనిఖీలు చేస్తున్నారు. విద్యార్థుల్లో విషయ జ్ఞానం పెరిగేలా అసెంబ్లీలో కచ్చితంగా వార్తలు చదివించాలని ఆదేశాలిచ్చారు. ప్రతిరోజూ అసెంబ్లీ షెడ్యూల్‌కు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి, దానిలో వివరాలు నమోదు చేయాలని సూచిస్తున్నారు. విద్యార్థులందరూ అసెంబ్లీ సమయానికే విధిగా హాజరయ్యేలా చూడాలని, ఉదయం 9:30 లోపు విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును విధిగా నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

షెడ్యూల్ ఇదే..

షెడ్యూల్ ప్రకారం సోమవారం మా తెలుగు తల్లికి మల్లెపూదండ (రాష్ట్ర గీతం), తెలుగులో ప్రతిజ్ఞ, లెర్న్ ఎ వర్డ్ ఎ డే, థాట్ ఆఫ్ ది డే (ఆ తేదీ ప్రాముఖ్యత), జనరల్ నాలెడ్జ్ ప్రశ్న, క్విజ్, తెలుగులో వార్తలు చదవడం, ప్రధానోపాధ్యాయుని సందేశం, జాతీయ గీతం, అదనంగా ప్రతి రోజు షెడ్యూలు ఉండాలి. మంగళవారం సారే జహాసే అచ్చా, రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ, తెలుగులో ప్రతిజ్ఞ చేయాలి. బుధవారం పాఠశాల భద్రతా ప్రతిజ్ఞ, హిందీలో ప్రతిజ్ఞ ఉంటుంది. గురువారం సారే జహాసే అచ్చా, హిందీలో ప్రతిజ్ఞ, ఇంగ్లిష్‌లో వార్తలు చదవడం ఉంటుంది. శుక్రవారం ప్రకృతి ప్రతిజ్ఞ, ఇంగ్లిష్‌లో ప్రతిజ్ఞ, ఇంగ్లిష్‌లో వార్తలు చదవడం చేయాలి. శనివారం తెలుగులో ప్రతిజ్ఞ, జనరల్ నాలెడ్జ్ ప్రశ్న, క్విజ్, ఇంగ్లీష్ లో వార్తలు చదవడం ఉంటుంది.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పాఠశాలలో అసెంబ్లీని సమయానికి ప్రారంభించాలి. షెడ్యూల్ ప్రకారం క్రమపద్ధతిలో జరగాలి. అసెంబ్లీకి పాఠశాలలో ఉపాధ్యాయులందరూ కచ్చితంగా హాజరుకావాలి. ఎవ్వరూ తరగతి గదిలో ఉండకూడదు. అసెంబ్లీ నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

– బి.దిలీప్ కుమార్, అర్బన్ రేంజ్ స్కూల్స్ డీఐ, రాజమహేంద్రవరం

వర్షాభావంతో ఖరీఫ్ వరినాట్లు ఆలస్యం



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ చల్లా నరసింహారావు

రాజమహేంద్రవరం రూరల్: వర్షాభావంతో ఖరీఫ్ వరినాట్లు ఆలస్యమవుతున్నాయని, ఈ నెలాఖరుకు నూరుశాతం పూర్తవుతాయని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా నరసింహారావు అన్నారు. హుకుంపేటలోని సహాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం రాజమహేంద్రవరం సబ్ డివిజన్ వ్యవసాయ సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ సాగు పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువులు, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, ఎలుకల నివారణ, పంట మార్పిడి, డ్రోన్ వినియోగం తదితర విషయాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి మాట్లాడుతూ నేల పరీక్ష ఆధారిత పోషక యాజమాన్యం పాటించాలన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. సార్వా సీజన్‌లో అధిక దిగుబడినిచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారులు సూర్య రమేష్, కల్యాణ్ కుమార్, రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం మండలాల వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ర్యాలీలో పాల్గొన్న బొజ్జ రామకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలోని విక్రమ హాల్ వద్ద గోదావరి ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ తక్కువ రేట్లకు పనిచేస్తున్న ఎలక్ట్రికల్ కార్మికుల పనులు అడ్డుకునేందుకు స్పెషల్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఈ స్క్వాడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని, అయినప్పటికీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా ప్రవేశ పెట్టలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే 100 రోజులలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సెస్ వసూలు చేస్తున్నారని, కానీ ఆ నిధులను భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమానికి ఖర్చు చేయడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రోడ్లపైకి వచ్చి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్స్ పొట్టకొడుతున్న ఇతర రాష్ట్రాల ఎలక్ట్రికల్ వర్కర్లను అడ్డుకుంటామన్నారు. వారి వల్ల రాజమండ్రి, చుట్టుపక్కల ప్రాంతాల కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ స్క్వాడ్ నెలకు 4 రోజులు పర్యటించి గుర్తింపు కార్డులు లేకుండా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న కార్మికులను అడ్డుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఆసపు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగాచార్యులు, ఆర్గనైజర్ శ్రీమల వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ గోవాడ కొండబాబు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంత్యుత్సవం



అయ్యంకి వెంకట రమణయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో గురువారం ఆంధ్ర గ్రంథాలయ శిల్పి, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి లైబ్రేరియన్ శ్రీదేవి, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ శ్రీదేవి మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య వాడవాడలా గ్రంథాలయాలు స్థాపించి, గ్రంథాలయ జ్యోతి వెలిగించారన్నారు. కాగా.. వెంకట రమణయ్య జయంతి సందర్భంగా గ్రంథాలయానికి వెంకటేశ్వర రైస్‌స్టోర్స్ అధినేత తేతల వీరరాఘవ రెడ్డి రూ.3 వేలు విలువైన రెండు కంప్యూటర్ టేబుళ్లను బహూకరించారు. ఈ సందర్భంగా తేతల వీరరాఘవరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులను శాలువాతో పాఠకులు సత్కరించారు. కార్యక్రమంలో వాగ్దేవు అలివేలు, శారద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

కడియం: వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో కడియం సెక్షన్ కార్యాలయంలో గురువారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వివరించారు. చైర్ పర్సన్ సత్యనారాయణ మాట్లాడుతూ పంపిణీ లోపాలను సవరించడంతో పాటు, సేవా లోపాలను సత్వరం పరిష్కరించాలన్నారు. లోడ్ సమస్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సర్వీసు క్రమబద్ధీకరణ, కొత్త స్తంభాలు వేయడం, మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సంపత్‌నగరం పరిధిలోని ఒక వ్యక్తి తనకు రూ.5 లక్షల కరెంటు బిల్లు వచ్చిందని, దానిని పరిష్కరించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే స్తంభాలు ఒరిగిపోయాయని, తీగలు కిందకు వేలాడుతున్నాయని పలువురు వివరించారు. తమ ఇంటి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ఒకరు ఫిర్యాదు చేశారు. అయితే పదేళ్లుగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపుపై కోర్టును ఆశ్రయించాలని సూచించారు. మొత్తం 17 సమస్యలు కమిటీ దృష్టికి రాగా, ఆరు ఫిర్యాదులను హియరింగ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో సీజీఆర్ఎఫ్ సాంకేతిక సభ్యుడు ఎస్.రాజబాబు, ఆర్థిక సభ్యుడు ఎస్.సుబ్బారావు, స్వతంత్ర్య సభ్యుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

నిత్యస్మరణీయుడు కాటన్ దొర



దుళ్లలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కందరెడ్డి తదితరులు

కడియం: ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మించి, ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీటిని అందించిన సర్ ఆర్థర్ కాటన్ నిత్య స్మరణీయుడు అని ఆదర్శ రైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి) అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో దుళ్లలో కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కందరెడ్డి మాట్లాడుతూ కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు కాటన్ దొర అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, సత్తి నాగిరెడ్డి, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, ప్రసాద్, దూడల సత్తిబాబు, రాజు, కులపాకుల సత్తిబాబు పాల్గొన్నారు.

వీధుల్లో పశువుల సంచారంపై చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని వీధుల్లో సంచరించే ఆవులు, గేదెలు, దూడలు, ఎద్దుల నియంత్రణకు ప్రజారోగ్య విభాగం చర్యలు చేపట్టిందని ఎంహెచ్ఓ వినూత్న గురువారం తెలిపారు. పశువులను యజమానులు చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. విచ్చలవిడిగా రోడ్ల మీదకు ఆవులు, ఇతర పశువులను వదలడం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డివైడర్ల వద్ద గ్రీనరీ కూడా దెబ్బతింటోందన్నారు. పైగా నివాస గృహాల మధ్య గేదెలు, ఆవులను కట్టి ఉంచడం వల్ల పేడ, మూత్రం అక్కడే నిల్వ ఉంటూ దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. నగరంలో పారిశుద్ధ్యం కుంటుపడటంతో పాటు చుట్టుపక్కల వారికి అసౌకర్యంగా మారుతోందన్నారు. యజమానులు తమ ఆవులు, గేదెలను రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు తమ సచివాలయాల పరిధిలో రోడ్లపైకి ఆవులు, గేదెలు తిరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు.

రాష్ట్రంలో కూటమి నియంత పాలన

- కక్ష సాధింపులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసు
- వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నియంత పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే కూటమి ప్రభుత్వం.. పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ నాయకులను కేసుల్లో ఇరికిస్తోందన్నారు. తద్వారా వారిని పార్టీకి దూరం చేయాలని భావిస్తోందన్నారు. రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై పెట్టిన లిక్కర్ కేసు పూర్తిగా నిరాధారమైనదన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఆయనను అరెస్టు చేశారన్నారు. ఆ కేసులు న్యాయస్థానంలో నిలిచేవి కావన్నారు. చంద్రబాబు నాయుడు తన ఆధ్వర్యంలో పనిచేసే అధికారులతో ఏర్పాటు చేసిన సిట్‌తో ప్రజల దృష్టి మరల్చడానికి వైఎస్సార్ సీపీలోని కీలక వ్యక్తులను అరెస్టు చేస్తున్నారన్నారు. అలాగే పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన కోర్కెలపై పోరాడుతున్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కూడా అన్యాయంగా హౌస్ అరెస్టు చేశారన్నారు. దానివల్ల కార్మికులకు అన్యాయం చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు.

ఉమెన్ గేమ్స్‌లో చాంపియన్ జీఎస్ఎల్



ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో జీఎస్ఎల్ విద్యార్థులు

రాజానగరం: మూడు రోజులుగా స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ 25వ ఉమెన్ గేమ్స్ పోటీలు గురువారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 24 మెడికల్, డెంటల్ కళాశాలల నుంచి 527 మంది క్రీడాకారులు పాల్గొన్నారని యూనివర్సిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ హెల్త్ యూనివర్సిటీలో లేని విధంగా గేమ్స్, కల్చరల్ కార్యక్రమాల నిర్వహణలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ఇంటర్ యూనివర్సిటీ నాన్ అకడమిక్ కార్యక్రమాలకు ఏటా రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలను బహూకరించారు. జీఎస్ఎల్ చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో మహాలక్ష్మి



శాకంబరిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి

సీటీఆర్ఐ: ఆషాఢ మాసంలోని అమావాస్య సందర్భంగా గురువారం గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి పీఠంలో కొలువైన అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ దేవీ భాగవతంతో పాటు మార్కండేయ పురాణంలోని చండీ సప్తశతిలో శాకంబరీ దేవి ప్రస్తావన ఉందన్నారు. ఆమె నీలవర్ణంలో సుందరంగా ఉన్న దేవి కమలాసనంపై కూర్చుని ఉంటుందని, తన పిడికిలి నిండా వరి మొలకలను పట్టుకొని, మిగిలిన చేతులతో పుష్పాలు, ఫలాలు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలైన కూరగాయల సముదాయాన్ని ధరించి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనుగ్రహప్రద ఫౌండేషన్ ఇంటర్నేషనల్ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్, వాసంశెట్టి గంగాధర్, కొత్త విజయరాజ్యలక్ష్మి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నవితరణ చేశారు.

సంక్షేమ నిధులు క్రైస్తవులకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నమాటి బాబ్జీ

సీటీఆర్ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ నిధులను క్రైస్తవులకు అందించాలని ఇంటర్నేషనల్ క్రిస్టియన్ అంబాసిడర్ ఆఫ్ ఏపీ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు బిషప్ పొన్నమాటి బాబ్జీ అన్నారు. లాలాచెరువు సమీపంలోని శాంతి నిలయం ప్రార్థనా మందిరంలో గురువారం ఆంధ్ర క్రిస్టియన్ మ్యారేజ్ లైసెన్స్ హోల్డర్ అసోసియేషన్ అనుబంధ ఇంటర్నేషనల్ క్రిస్టియన్ అంబాసిడర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశం జరిగింది. రెవరెండ్ డాక్టర్ పి.సుందరరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రైస్తవుల సమస్యలను పరిష్కరించేందుకు 12 సూత్రాలతో ఒక మెమోరాండం తయారు చేసి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసుకు అందించారు. ఇండియన్ క్రిస్టియన్ మ్యారేజ్ లైసెన్స్ హోల్డర్ వివాహం చేసుకునే దంపతులకు ఇచ్చిన మ్యారేజ్ సర్టిఫికెట్ ఆధార్ కార్డులో ఇంటి పేరు మార్పు, రేషన్ కార్డు పొందడంలో ఇబ్బందులను సరిదిద్ది న్యాయం చేయాలని సమావేశం కోరింది. కార్యక్రమంలో డేనియల్ విల్సన్, బిషప్ నక్కా ఆనంద్ కుమార్, సుందరరాజు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

రాజానగరం: మండలంలోని పాత తుంగపాడుకు చెందిన బోయిడి సత్యనారాయణ (49) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై వీర్రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణకు ఆర్థిక ఇబ్బందులు కూడా తోడవడంతో విసిగిపోయాడు. ఇదే సమయంలో కొడుకు రోడ్డు ప్రమాదానికి గురై కాలు, చేయి విరిగి మంచాన పడటం అతన్ని మరింత కుంగదీసింది. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ప్రాజెక్టు వర్కర్లు

సీతానగరం: మండలంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికుల ఆందోళన గురువారం 17 రోజులకు చేరింది. రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద ఆందోళనకారులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

పందలపాక ఉన్నత పాఠశాల పరిశీలన

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో బోధనా అంశాలపై చర్చించారు. పదో తరగతి చాల కీలకమని, ముందు నుంచి చదివితే, పరీక్ష సమయంలో చాలా సులువుగా అనిపిస్తుందన్నారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాల గతంలో కంటే ఇంకా మెరుగుపడాలని, అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తీసేలా చూడాలన్నారు. హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.